# చైతన్య గళం
తెలుగు దిన పత్రిక




సంచిక :180 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి, నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగర్ శనివారం 03-8 -2024 వెల : .రూ. 5.00

## జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం




- నోటిఫికేషన్లు..పరీక్షలు.. తేదీల వివరాలు ప్రకటన
- అసెంబ్లీలో ప్రకటించిన డిప్యూటి సిఎం భట్టి
- గతంలో అస్తవ్యస్త విధానాలతో నిరుద్యోగులకు నిరాశ
- ఇచ్చిన హామీ మేరకు ముందుకు వెళుతున్నామని వెల్లడి

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి -మిగతా 2 లో



## నీట్‌లో విస్తృతస్థాయి లోపాలు జరగలేదు

- లీక్ కేవలం బీహార్, జార్ఖండ్‌లకే పరిమితం
- పరీక్షను రద్దు చేయాల్సిన అసవరం లేదు
- మరోమారు కీలక వ్యాక్యలు చేసిన సుప్రీం

02,ఆగష్టు (చైతన్యగళం)-న్యూఢిల్లీ,

నీట్ యూజీ 2024 పరీక్ష ప్రశ్నపత్నం లీకేజీ వ్యవహారంలో సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షను రద్దు చేయాల్సిన అవసరం లేదంటూ ఇటీవల కీలక తీర్పునిచ్చిన ధర్మాసనం.. అందుకుగల కారణాలను వివరిస్తూ శుక్రవారం మళ్లీ తీర్పు వెలువరించింది. ఈసందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లోపాలను ధర్మాసనం ఎత్తిచూపింది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది. నీట్ పేపర్ లీకేజీలో ఎలాంటి వ్యవస్థీకృత ఉల్లంఘనలు చోటుచేసుకోలేదు. పరీక్ష పవిత్రతను దెబ్బతీసేలా విస్తృత స్థాయిలో లీక్ జరగలేదు. ప్రశ్నపత్రం లీకేజీ ఝార్ఖండ్‌లోని హజారీబాగ్, బిహార్‌లోని పట్నా వరకే

-మిగతా 2 లో

## టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు



- తెలంగాణ సాధనలో వారి పాత్ర కీలకం
- 25వేలమందికి పదోన్నతులు కల్పించాం
- ఒకటో తేదీన జీతాలు పడేలా చేస్తున్నాం
- పేదల చదువుతోనే తెలంగాణకు భాగ్యం
- సర్కారీ బడికి వెళ్లడం ఆత్మగౌరవంగా భావించాలి
- పాఠశాలలకు ఉచిత విద్యుత్..మౌలిక వసతుల కల్పన
- ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో భేటీలో సిఎం రేవంత్

02,ఆగష్టు (చైతన్యగళం) హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే -మిగతా 2 లో

## లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారిపై లైంగిక దాడి



- 9వ తరగతి విద్యార్థి వికృత చేష్టలు
- స్కూలు ముందు చిన్నారి బంధువుల ఆందోళన

2




## ధరణి పేరుతో నాటి ప్రభుత్వం దగా

- గుంట భూమి కూడా అమ్ముకోలేని దుస్థితి
- ప్రైవేట్ కంపెనీకి ధరణి అప్పగించడంతో సమస్యలు
- విదేశీ కంపెనీ చేతిలో తెలంగాణ భూముల వివరాలు
- బిఆర్ఎస్ నిర్వాకంతో రైతులకు శాపంగా మారింది
- ధరణిని భూమాతగా మార్చడంపై పొంగులేటి వివరణ
- గతంలో అనేక సమస్యలు వచ్చాయన్న సీతక్క
- అందరితో చర్చించే ధరణిని తెచ్చామన్న పల్లా

02,ఆగష్టు (చైతన్యగళం)-హైదరాబాద్,

ధరణి స్థానంలో భూమాతను తీసుకుని వస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కేబినేట్ ఆమోదంతో దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ధరణితో గుంట భూమి కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పొంగులేటి ధరణి పై మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుందని ప్రజలు విశ్వాసంలో ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం ధరణినీ ఐఎల్ ఎఫ్ కంపనీకి అప్పగించారని మండిపడ్డారు. కంపనీ కొన్ని కారణాలతో.. సింగపూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగపూర్ కంపనీకి కేసీఆర్ తెలంగాణ భూములు తాకట్టు పెట్టారు అని మండిపడ్డారు. డిఫాల్ట్ -మిగతా 2 లో



## మంత్రి సీతక్కపై మార్ఫింగ్ వీడియో

పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు

హైదరాబాద్,
సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు సాధారణమయ్యాయి. సామాన్య మహిళలే కాదు మంచి హోదా, పరపతి ఉన్న వారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పుడు ఏకంగా తెలంగాణ రాష్ట్ర మహిళా మంత్రిని సైతం వదలలేదు ఆగంతకులు. మంత్రి సీతక్కకు సంబంధించిన

-మిగతా 2 లో

## ప్రజలు తిరగబడే రోజు తప్పకుండా వస్తుంది



- మార్పు పేరుతో...ప్రజలను ఏమార్చలేరు
- జాబ్ క్యాలెండర్ పేరుతో మరోమారు మోసం
- ఉద్యోగాలు ప్రకటించకుండానే నిరుద్యోగుకలు మోసం
- గన్‌పార్క్ వద్ద నిరసనలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్

02,ఆగష్టు (చైతన్యగళం)- హైదరాబాద్,

మార్పు మార్పు అంటూ తెలంగాణ ప్రజలను ఎక్కువ రోజులు ఏమార్చలేరని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పకుండా ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి.. నువ్వు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పమని రాహుల్ గాంధీ, -మిగతా 2 లో



## పథకాలతో అత్యుత్తమ ఫలితాలు రావాలి

-మహిళా శిశు సంక్షేమ పథకాలపై సమీక్ష
-మరింత పకడ్బందీగా అమలుకు సిఎం బాబు ఆదేశం

అమరావతి, పథకాలు అందించడమే కాదు.. వాటి ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రణాళికతో పనిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖపై సచివాలయంలో శుక్రవారం సీఎం సమీక్ష చేశారు. మహిళలు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సాధికారత, మాతా శిశు మరణాలు, మిషన్ వాత్సల్య కింద చేపట్టే చైల్డ్ ప్రొటెక్షన్ కార్యక్రమాలపై అధికారులతో సీఎం -మిగతా 2 లో

# జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం

(మొదటి తరువాయి)

భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్దం పాటు

అధికారంలో ఉన్నా, నిరుద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడంలో భాగంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దు అయిందని, ఉద్యోగాల భర్తీ పక్రియ గందరగోళంగా మార్చారని ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ లతో రెండు కమిటీలు ఏర్పాటు చేసి, వారి సూచనల్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాత గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేసి, 60 కొత్త పోస్టులతో మొత్తం 563 పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు 3 లక్షల మంది హాజరుకాగా, పరీక్ష సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటించామన్నారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక లక్షా 45 వేల 368 మంది హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఎగ్జామ్ కు 1 లక్షా 6 వేల 2 వందల 60 మంది హాజరుకాగా, విజయవంతగా నిర్వహించాం. 32 వేల 4 వందల 10 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,500 ఉద్యోగ ఖాళీల భర్తీకి అనుమతులు ఇచ్చాం. 11 వేల 62 ఖాళీలతో టీచర్ రిక్రూట్ మెంట్ కోసం డీఎస్సీ ఎగ్జామ్ ప్రకటించాం. జులై 18న ప్రారంభమై ఆగస్టు 5న ముగియనున్నాయి. 465 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీల భర్తీకి, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ లో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాం. పరీక్షల ప్రిపరేషన్ కు తగినంత సమయం లేదని అభ్యర్థులు కోరడంతో ఆగస్టు నుంచి డిసెంబర్ కు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశాం. పరీక్షా తేదీలు ఒకటే కాకుండా, పరీక్షల మధ్య ప్రిపరేషన్ కు సమయం ఉండేలా అన్ని నియామక బోర్డులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాయని భట్టి విక్రమార్క ప్రకటించారు. గత ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల పేపర్లు లీకయ్యాయి, పేపర్ల అమ్మకంతో పరీక్షలు రద్దయ్యాయి. పేపర్ లీక్ కారణంగా 2023 మార్చి 17న తొలిసారి గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దయింది. అభ్యర్థుల బయో మెట్రిక్ తీసుకోని కారణంగా హైకోర్టులో రెండోసారి ఎగ్జామ్ రద్దు అయింది. ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, కొత్త చైర్మన్ ను నియమించి వరుసగా పోస్టుల భర్తీని పూర్తి చేశాం. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎగ్జామ్స్ సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నామని' భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఇకపోతే షెడ్యూల్ ప్రకారం..వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ట్రాన్స్‌కోలోని వివిధ ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు చేపడతారు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు చేపడతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు జరుగుతాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు చేపడతారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జులైలో నిర్వహించ నున్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్..సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది మేలో

మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు జరుపుతారు. సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు చేపడతామని ప్రకటనలో వివరించారు.

# టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు

(మొదటి తరువాయి)

వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని ఉద్ఘాటించారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 25వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 30 వేల మందిని బదిలీ చేశాం. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు మీ ఖాతాలో పడేలా చూసే బాధ్యత మాది. ఈ సమ్మేళనంలో రాజకీయం, స్వప్రయోజనం లేదు. తెలంగాణ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవం అని తల్లిదండ్రులు భావించాలి. అందుకు అందరం కలిసి కృషి చేయాలి. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తాం. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తాం.. ఆ బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తుంది. పేద పిల్లలు, దళిత వర్గాల పిల్లలు చదువుకుని బాగు పడితేనే రాష్ట్రం బలపడుతుంది. దిల్లీలో మూడుసార్లు కేజీవ్రాల్ గెలిచింది బస్తీల్లో పాఠశాలలు మెరుగుపరచడం వల్లే. మళ్లీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉండాలంటే మీరు పేదలకు చదువు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారని... తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని అనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయు లను ఏ విధంగా అవమానించారో చూశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు..10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు..మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం అన్నారు.

# నీట్‌లో విస్తృతస్థాయి లోపాలు జరగలేదు

(మొదటి తరువాయి)

పరిమితమైంది. దానిపై దర్యాప్తు జరుగుతోంది. అందుకే మేం పరీక్షను రద్దు చేయాలనుకోలేదు. అయితే, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయి. విద్యార్థుల భవితకు సంబంధించిన అంశంలో ఇలాంటివి చోటుచేసుకోవడం సరికాదు. ఈ సమస్యను కేంద్రం ఈ ఏడాదే పరిష్కరించాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్టీయేదేనని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈసందర్భంగా ఎన్టీయే పనితీరు, పరీక్షల్లో సంస్కరణల కోసం నియమించిన ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని కమిటీకి సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్యానెల్‌ను మరింత విస్తరించాలని పేర్కొంది. పరీక్షా విధానంలో లోపాలను సరిదిద్దడానికి అవసరమైన చర్యలపై కమిటీ సెప్టెంబరు 30లోగా తమ నివేదికను అందజేయాలని ఆదేశించింది. పరీక్షా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సాయం తీసుకోవాలని సూచించింది. ఈ నివేదిక అందిన తర్వాత అందులోని అంశాలను అమలుచేసే అంశంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రం, విద్యాశాఖను ధర్మాసనం ఆదేశించింది. ఈ ఏడాది నీట్ ప్రవేశపరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. దీంతో పేపర్ లీకేజీ, ఇతర అక్రమాలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం నీట్ యూజీ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని తీర్పు వెలువరించింది. మళ్లీ పరీక్ష పెడితే 24 లక్షల మంది ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది

# ధరణి పేరుతో నాటి ప్రభుత్వం దగా

(మొదటి తరువాయి)

కంపనీ కి ధరణి పోర్టల్ అప్పగించారని అన్నారు. బీఆర్ఎస్ చేసిన నిర్వాకం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఇద్దరు వ్యక్తులు కూర్చొని చేసిన చట్టం ధరణి అన్నారు. ఆల్ ఇన్ వన్ గా చెప్పుకున్న పెద్దాయన చేసిన నిర్వాకం ఇది అని తెలిపారు. ధరణి పేరుతో దగా చేశారన్నది నిజం అని అన్నారు. పదేళ్ల తెలంగాణ రాష్ట్రం.. ధృతరాష్ట్ర కౌగిలో ఇరుక్కుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కొండ నాలుక కి మందు వేస్తే ఉన్న నాలిక పోయినట్టుగా ధరణి ఉందని అన్నారు. 1973లో కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ చట్టం తీసుకొచ్చి పేదలకు భూములు పంపిణీ చేసిందన్నారు. వైఎస్ హయాంలో బీడు భూములకు పట్టాలు ఇచ్చారన్నారు. ప్రజలకు మేలు చేసిన వారి పేర్లను ప్రస్తావించడం తగదన్నారు. భూసంస్కరణలతో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని చాలా మంది చెప్పారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ లోపభూయిష్టంగా ఉంది. ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భూసంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అనేక అంశాలు భూ సంస్కరణలతో ముడిపడి ఉన్నాయి. పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా భూసంస్కరణలు చేపట్టారన్నారు. ప్రపంచ చరిత్రలో నిలిచిన భూదాన ఉద్యమం ఇక్కడే పుట్టిందన్నారు. ధరణీ చట్టం మూడు తలలతో మొదలై.. 33 తలలతో అవతరించిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన సమయంలో ఎక్కడికి వెళ్లినా ధరణీ సమస్యల గురించే ప్రజలు ఆయనకు వివరించారన్నారు. ధరణీని బంగాళఖాతంలో వేస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని గుర్తు చేసారు. ధరణీతో సామాన్యులు అవస్థలు పడ్డారని పొంగులేటి తెలిపారు. ధరణీ వచ్చిన తరువాత ప్రతీ గ్రామంలో సమస్యలే ఉన్నాయన్నారు. అప్పటి సర్కార్ పెద్దలు ధరణీ పేరుతో ప్రజలకు దగా చేశారన్నది ముమ్మాటికి నిజమన్నారు. ధరణీ సమస్యలతో రైతులు రోడ్డున పడ్డారు. చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేసారు.

# ప్రజలు తిరగబడే రోజు తప్పకుండా వస్తుంది

(మొదటి తరువాయి)

రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇచ్చిందని అక్కడ ఉన్న నిరుద్యోగులతో చెప్పించాలన్నారు. అలా చేస్తే మేమందరం రాజీనామా చేస్తామని సవాలు విసిరారు. రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అని కేటీఆర్ అన్నారు. ఈ విషయం మీకు కూడా తెలుసని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలుసు.. అయినా కూడా పిల్లల్లో ఉద్వేగాల్ని రెచ్చగొట్టేవిధంగా లేని ఒక వాతావరణం నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మీ క్యాలెండర్ బోగస్.. అందులో ఉద్యోగాలే లేవు. అందులో తారీఖులు తప్ప ఏమీ లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు. సిగ్గులేకుండా మళ్లీ మా ఎమ్మెల్యేలను సాటి ఎమ్మెల్యేతో ఒక బజారు భాషలో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి, శాసనభకు చీకటి రోజు అని ఆయన వ్యాఖ్యానించారు. దుర్మార్గమైన పద్ధతిలో నిన్న, మొన్న మా అక్కల్ని అవమానించారని.. ఇవాళ ఒక సభ్యుడు అమ్మ, అక్క అని తిడుతుంటే శాడిస్టు మాదిరిగా ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతూ అందర్నీ ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తప్పకుండా తెలంగాణ యువత తప్పకుండా రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు..

## లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారిపై లైంగిక దాడి

-9వ తరగతి విద్యార్థి వికృత చేష్టలు

-స్కూలు ముందు చిన్నారి బంధువుల ఆందోళన

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలో దారుణం జరిగింది. ఉప్పల్ లోని లిటిల్ ఫ్లవర్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఓ బాలికపై లైంగిక దాడి చేశాడు ఓ బాలుడు. క్లాస్ రూంలోనే ఈ దాడి జరిగినట్లు ఆ చిన్నారి చెబుతోంది. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి రావటం సంచలనంగా మారింది. విషయం తెలిసిన చిన్నారి పేరంట్స్ స్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. స్కూల్ లో ఇంత జరుగుతుంటే టీచర్లు ఏం చేస్తున్నారంటూ చిన్నారి పేరంట్స్, బంధువులు నిలదీస్తున్నారు. లైంగిక దాడి చేసిన బాలుడి వివరాలను స్కూల్ యాజమాన్యం రహస్యంగా ఎందుకు ఉంచుతుందని ప్రశ్నిస్తున్నారు. విషయం తెలిసిన పోలీసులు లిటిల్ ఫ్లవర్ స్కూల్ కు చేరుకుని విచారణ చేస్తున్నారు. టీచర్లతో మాట్లాడారు. బాలుడి వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. సున్నితమైన అంశం కావటంతో.. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కూల్ గేట్లను మూసివేశారు. చిన్నారిపై 9వ తరగతి విద్యార్థి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఉప్పల్ ప్రముఖ స్కూల్ లో కలకలం రేపింది. రెండో తరగతి చిన్నారిపై 9 తరగతి విద్యార్థి అసభ్యంగా ప్రవర్తించాడు. చిన్నారితో వికృతి చేష్టలకు పాల్పడ్డాడు. దీంతో చిన్నారి తమ తల్లిదండ్రులతో విషయం చెప్పడంతో చిన్నారి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. స్కూల్ యాజమాన్యం స్పందించాలని ధర్నా చేశారు. దీంతో స్కూల్ మేనేజ్మెంట్ స్పందించి 9వ తరగతి విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించారు. స్కూల్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## మంత్రి సీతక్కపై మార్ఫింగ్ వీడియో

(మొదటి తరువాయి)

వీడియోను కొందరు ఆగంతకులు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారు. వీడియోని మార్ఫింగ్ చేసి సౌండ్స్ మార్చి ఎక్స్ ఖాతాలో సదరు ఆగంతకులు సర్క్యులేట్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది వెంకట నాయక్ ఫిర్యాదు చేశారు. అలానే మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కూడా మార్ఫింగ్‌పై కూడా ఫిర్యాదు చేశారు. రెండు వీడియోలను సర్కులేట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ వెంకట్ నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్వకేట్ వెంకట నాయక్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు మంత్రి సీతక్క వీడియో మార్ఫింగ్ అంశం తెలంగాణ అసెంబ్లీలో చర్చకు వచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సభలో ఏదో వీడియో తీసుకుని ఇష్టారాజ్యంగా పోస్టు చేస్తున్నారని, పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన మహిళా మంత్రిపై ఇలాంటి పోస్టులా అంటూ మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... పార్లమెంట్, అసెంబ్లీలో ఫోటోలు తీయడం నేరమని.. దీనిపై కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు.

## పథకాలతో అత్యుత్తమ ఫలితాలు రావాలి

(మొదటి తరువాయి)

సమీక్షించారు. గర్భిణులు, బాలింతలకు అమలవుతున్న పథకాలు, పిల్లలకు అందించే పౌష్టికాహార పథకాలపై సమీక్ష చేశారు. 2014లో ప్రవేశపెట్టిన బాలామృతం, అమృత హస్తం, గోరుముద్ద, గిరి గోరుముద్ద, బాల సంజీవని వంటి పథకాల స్థితిగతులను తెలుసుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 55,607 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని?అందులో ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు 48770 ఉండగా, మినీ అంగన్వాడీలు 6,837 ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందులో గిరిజన ప్రాంతాల్లో 8,311 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 2014 నుంచి 2019 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 12,496 కేంద్రాలను నిర్మించాలనే లక్ష్యంతో పనులు మొదలుపెట్టగా 2019 నాటికి అందులో 6,119 నిర్మాణాలు పూర్తి అయ్యాయిని, మరో 2800 నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. అయితే గత ఐదు ఏళ్లలో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణంపై దఅష్టి పెట్టలేదని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం కొత్తగా 2,048 అంగన్వాడీ కేంద్రాలను మంజూరు చేసి కేవలం 18 కేంద్రాలను మాత్రమే పూర్తి చేసిందని అధికారులు వివరించారు. అంగన్వాడీల అప్ గ్రెడేషన్లో కూడా పురోగతి లేదని వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికీ 14,597 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు అని, 8,455 సెంటర్లలో విద్యుత్తు సదుపాయం లేదని సీఎంకు అధికారులు సమీక్షలో వివరించారు.

# వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





**-క్రాప్ బుకింగ్ క్షేత్రస్థాయిలో పొలం వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడి చేయాలి లేదంటే చర్యలు తప్పవు**
**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి ఆగస్ట్ 2 (చైతన్య గళం):**
రైతులు ఏ పంటలు వేస్తున్నారు, ఎన్ని ఎకరాల్లో వేస్తున్నారు అనే వివరాలు తెలుసుకోడానికి ప్రతి సీజన్ కు వ్యవసాయ విస్తీర్ణాధికారులు క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంటుంది. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ సంచి గంగ్వార్ తో కలిసి పెబ్బేరు మండలం కంచిరావు పల్లి శివారులో చేస్తున్న క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. అధికారులు ఒకచోట కూర్చొని అంచనాలతో క్రాప్ బుకింగ్ చేయవద్దని, ప్రతి పొలం వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడి క్రాప్ బుకింగ్ చేయాలని అంతే తప్ప ఏ ఒక్క రైతు మా వ్యవసాయ విస్తీర్ణాధికరి ఎవరో తెలియదు, క్రాప్ బుకింగ్ కొరకు సంప్రదించలేదు అని తెలిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారులను హెచ్చరించారు. క్రాప్ బుకింగ్ సమయంలోనే రైతు భీమ చేయించాడా లేదా అని తెలుసుకోవాలని, ప్రతి రైతుకూ భీమ చేయించాలని సూచించారు.

**కంచిరావు పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్**

కంచీరావు పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ పాఠశాల గదులు, పరిసరాలను పరిశీలించారు. ఉన్నత పాఠశాలకు కేవలం ఒకే బాత్రూం ఉందని, మగపిల్లలు రోడ్డు దాటి బయటనే మూత్ర విసర్జనకు వెళుతున్నారని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మన ఊరు మన బడి కింద మంజూరు అయినప్పటికీ పూర్తిస్థాయిలో పనులు జరగలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ మరుగుదొడ్లు నిర్మించేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ శాఖ డి. ఈ నీ ఆదేశించారు. విద్యార్థులతో ముచ్చటించి కలెక్టర్ ఉన్నత లక్ష్యంతో చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం కంచిరావు పల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాటశాల పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లేదని, పనులు పూర్తి కాకుండానే పూర్తి అయినట్లు తప్పుడు నివేదిక ఇవ్వడం పై ఇంజనీరింగ్ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని, నాణ్యత లోపం ఉంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

**శ్రీరంగాపూర్ రంగనాయక స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామి ఆశీర్వాదాలు తీసుకున్న జిల్లా కలెక్టర్**

శ్రీరంగాపూర్ పర్యటన సందర్భంగా ఆలయాన్ని సందర్శించి శ్రీదేవి భూదేవి రంగనాయక స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ పూజారులు స్వామి వారి శేష వస్త్రాలతో ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ రాజేంద్ర ప్రసాద్ ఆలయం విశేషాలు వివరించడంతో పాటు శ్రీరంగాపూరు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచాలని కలెక్టర్ ను కోరారు. అనంతరం శ్రీరాంగాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని అదేవిధంగా మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు.

**పిల్లలకు తల్లి పాలు విధిగా తాపాలి తల్లి పాలల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుంది**

శ్రీరంగాపూర్ పర్యటనలో భాగంగా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడే ఉన్న కొంతమంది గర్భిణులు, బాలింతలు, ఆశ వర్కర్లతో మాట్లాడారు. ఆశా వర్కర్లు, ఏ.ఎన్.యం లు ఇంటి సందర్శన చేస్తున్నారా, గర్భిణుల వద్దకు వెళ్లి సలహాలు సూచనలు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తల్లి పాల ప్రాముఖ్యతను సోదాహరణంగా బాలింతలకు వివరించారు. పుట్టిన బిడ్డకు గంట లోపు తల్లి పాలు తాపించాలని, తల్లి పాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉండటం వల్ల పిల్లలకు భవిష్యత్తులో చాలా రోగాల నుండి తప్పించుకోవచ్చన్నారు. గర్భిణులకు ఈ విషయాన్ని ముందే బాగా అవగాహన కల్పించాలని ఆశా వర్కర్లను సూచించారు. అనంతరం ఆసుపత్రి సమస్యల పై వైద్యులతో చర్చించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి జయచంద్ర మోహన్, డా . సాయినాథ్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పరిమళ, పెబ్బేరు తహసిల్దార్ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ రవీందర్, డి. ఈ శ్రీనివాస్ , ఎ. ఈ. ఒ లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైడే కార్యక్రమాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలి

**-అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**



**వనపర్తి ఆగస్టు 2 (చైతన్య గళం):**
గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమం సందర్భంగా పెద్దమందడి మండలంలోని జగత్ పల్లి, మనిగిల్ల, గట్లఖానా పూర్ గ్రామాల్లో పర్యటించి డ్రై డే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల పై ప్రజలకు గ్రామ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం గట్లఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

## సుప్రీంకోర్టు తీర్పు మాదిగల విజయం



**ఆమనగల్లు ఆగస్ట్ 2 (చైతన్య గళం):**
ఆమనగల్లు SC వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును హర్షిస్తూ. అమనగల్ మండల కేంద్రంలో ఎంఆర్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు మల్లెపోగు మల్లేష్ మాదిగ అద్వర్యం లో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసిన అనంతరం వర్గీకరణ సాధకుడు అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటాల ఉద్యమ వీరుడు అభినవ అంబేద్కర్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకి పాలాభిషేకం చేసి,బాణసంచ కాల్చి స్వీట్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జంతుక యాదయ్య మాదిగ, జంతుక జనయ్య మాదిగ, పులికంటి మైసయ్య మాదిగ, వస్పుల సాయిలు మాదిగ, ఒగ్గు మహేష్ మాదిగ, పోతుగంటి కృష్ణ మాదిగ , Mrps రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి తుడుం చంద్ర కిరణ్ మాదిగ జిల్లా ఉపాధ్యక్షులుమండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు జంతుక శంకర్ మాదిగ జంతుక కిరణ్ మాదిగ,వస్పుల రవి మాదిగ, మిఠాయిపల్లి రమేష్ ,అల్లాజి ,కృష్ణయ్య, మహేష్, శ్రీశైలం ,యాదయ్య, రాజు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

# మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ తీర్పు

**కడ్తాల్ ఆగష్టు 2 (చైతన్య గళం):**
మాదిగ రిజర్వేషన్ పోరాటం సమితి భుజాన వేసుకొని 30 సంవత్సరాలు విరామం లేకుండా మంద కృష్ణ మాదిగ పోరాటానికి ఫలితమే ఎస్సి ఎస్టీ వర్గీకరణ అమలు అని గురువారం సుప్రీం కోర్టు ఎస్సి ఎస్టీ వర్గీకరణ పై గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కంబలపల్లి అంజి, సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఈ వర్గీకరణ సాధ్యం అయిందని అన్నారు.



వర్గీకరణ పోరుబాటలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మంద కృష్ణ మాదిగ ఎస్సి వర్గీకరణ కోసం ఎక్కడ ధర్నాలు, నిరసనలు, రాస్తారోకలు, రోడ్లు, సభలు ఏర్పాటు చేసిన పెద్ద ఎత్తున తరలివెల్లి విజయవంతం చేశామని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం కష్టపడిన, అండగా నిలిచిన నా జాతి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయపరంగా, ఆర్థికంగా వెనకబడి ఉన్న జాతికి నిజమైన స్వాతంత్ర్యం ఈ రోజు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తి కృష్ణ, లక్ష్మయ్య, శంకర్, అశోక్, మహేష్, కృష్ణ, వేంకటేశ్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండ జడ్పీహెచ్ఎస్ ప్రధానోఉపాధ్యాయుల పదవి విరమణ



**వెల్దండ ఆగస్టు 2 (చైతన్య గళం):**
ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి దంపతులను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యన్నం భూపతి రెడ్డి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ సమాజానికి దిక్సూచి లాంటి వారు ఉపాధ్యాయులని. ఉత్తమ సేవలతోనే గుర్తింపు వస్తుందని మాజీ.సర్పంచ్ యన్నం భూపతి రెడ్డి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు. బచ్చు రామకృష్ణ అన్నారు వెల్దండమండల. కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి.జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత. ఎస్ జైపాల్ రెడ్డి.పదవి విరమణ మహోత్సవాన్ని మండల కేంద్రంలోని.ఆకృతి గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు సందర్భంగా. జైపాల్ రెడ్డిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో.మాజీ ఎంపిటిసి.వై విజేందర్ రెడ్డి.అల్వాల్ రెడ్డి కృష్ణారెడ్డి . శిశుపాల్ రెడ్డి. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల ఉన్నారు.

## పోటోగ్రాపర్ల ఆత్మీయ సభ పోస్టర్ ఆవిష్కరణ



**యాచారం ఆగస్ట్ 2 (చైతన్య గళం):**
యాచారం ఆగష్టు 6న శంషాబాద్ MSగార్డెన్ లో జరుగబోయే ఫోటో గ్రాఫర్ల ఆత్మీయ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన రంగారెడ్డి జిల్లా కోశాధికారి ఏర్పుల మల్లేష్ . ఈకార్యక్రమంలో యాచారం మండలం అధ్యక్షులు ఏర్పుల లింగం యాదవ్ మండలం ఉపాధ్యక్షుడు నరేందర్ మండల కోశాధికారి విజయ్ కుమార్ మరియు మండల కమిటీ సభ్యులు సంగం వెంకటేష్, రాజు, అప్పరెడ్డిపల్లి శేఖర్, పోలోజు నవీన్,మధు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దంపతులు



**అలంపూర్ ఆగస్ట్ 2 (చైతన్య గళం):**
18వ శక్తిపీఠం అలంపూర్ జోగులాంబ అమ్మవారిని శుక్రవారం మాజీ మంత్రి సింగిరెడ్డి వాసంతి నిరంజన్ రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయకార్యనిర్వహణాధికారి ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం ప్రధాన అర్చకులు, వేదపండితులు వారిచే పూజలు నిర్వహించి వేదమంత్రాలతో ఆశీర్వదించారు.ఆలయ అధికారులు మాజీమంత్రి సింగిరెడ్డి వాసంతి నిరంజన్ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.

## పోటోగ్రాపర్ల ఆత్మీయ సభ పోస్టర్ ఆవిష్కరణ



**కడ్తాల్ ఆగస్టు 2 (చైతన్య గళం):**
కడ్తాల్ మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగష్టు 6న శంషాబాద్ MS గార్డెన్ జరుగబోయే ఫోటో గ్రాఫర్ల ఆత్మీయ సమ్మేళనం మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.మన రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి పేరెపల్లి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఫోటోగ్రఫీ చరిత్రలో రెండోసారి దాదాపు 1500 ఫోటోగ్రఫీ కళాకారులతో మన ఐక్యతను చాటుతూ పరస్పర అభివృద్ధికి తోడ్పడే ఆత్మీయ సమ్మేళనం ఈ సభకు పెద్ద ఎత్తున ఫోటో అండ్ వీడియోగ్రాఫర్లు హాజరుకావాలని అలాగే పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో మరియు కడ్తాల్ మండలం అధ్యక్షులు శ్రీశైలం ముదిరాజ్, మరియు మండల కార్యవర్గం బీష్మాచారి,కిరణ్ ,రబ్బానీ, శివ, నదీమ్, మహేష్, కృష్ణ,సాయి, బాద్రి, నవీన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాన సరస్వతి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన



**యాచారం ఆగష్ట్ 2 (చైతన్య గళం):** శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారు ఆషాఢ మాస చివరి శుక్రవారం సందర్భంగా నందివనపర్తి గ్రామంలో మాతృమండలి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ జ్ఞాన సరస్వతీ మాటకు శాకాంబరి అలంకరణలో దర్శనం ఇచ్చారు మరియు మాతృమూర్తులు సామూహిక లలితా సహస్ర నామ పారాయణం మరియు కుంకుమార్చణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులందరికి దర్శనం కల్పించారు దేవాలయం కమిటీ. ఈకార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# మోడల్ కళాశాల బాలికల హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి



**వెల్దండ ఆగస్టు 2 (చైతన్య గళం:** ఈరోజు పి డి ఎస్ యు, జి వి ఎస్ గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మోడల్ కళాశాల గర్ల్స్ హాస్టల్ పరిశీలన చేసి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని కేర్ టేకర్ స్వరూప కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు సంతోష్ మాట్లాడుతూ బాలికల హాస్టల్ లో మెనూ ప్రకారం నాణ్యమైన ఫుడ్ పెట్టాలని, హాస్టల్లో మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచాలని, ఏ ఎన్ ఎం నర్సు నియమించాలని, వాష్ రూమ్స్ కు డోర్లు ఏర్పాటు చేసి శుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులకు సరిపడా వాటర్ లేదని ఆ సమస్యను పరిష్కరించాలని, హాస్టల్ చుట్టు పరిసర ప్రాంతాల్లో శుభ్రపరచాలని, హాస్టల్ రూమ్ శుభ్రం చేయడానికి ఒక స్వీపర్ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు రాహుల్ నాయక్ ,విద్యార్థి నాయకులు మధు, వినోద్ , నాగరాజు, అర్జున్ , నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం కమిషనర్లను తక్షణమే నియామించాలి

- చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆర్ టి ఐ రక్షక్ ఎనలేని కృషి
- ఆర్ టి ఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాపోలు లింగస్వామి

**ఎల్ బీ నగర్ ఆగస్టు 2 (చైతన్య గళం):** సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్లను తక్షణమే నియమించాలని ఆర్ టి ఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రాపోలు లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్బీనగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రాపోలు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వచ్చి 18 సంవత్సరాలు అవుతున్న గాని సామాన్య ప్రజలకు రోజు రోజుకి అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ ప్రజలకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమవడంతో నేటి వరకు కూడా సామాన్య ప్రజలకు ఈ చట్టం పైన అవగాహన లేకుండా పోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా



ఆర్ టి ఐ రక్షక్ కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సూచిక బోర్డులను పరిశీలించి బోర్డులు లేనియెడల నూతన బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా కానీ సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేయడంలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. దింతో సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారులు తమకు కావలసిన సమాచారాన్ని ఏ కార్యాలయంలో ఈ అధికారిని కలిసి దరఖాస్తు చేసుకోవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్ టి ఐ రక్షక్ సమాచార హక్కు చట్టాన్ని గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. దరఖాస్తుదారులు కోరినటువంటి సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ఇవ్వడంలో కూడా అధికారులు కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చట్టాన్ని దీంతో చట్టం నీరు కారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిషనర్ లేకపోవడంతో దరఖాస్తు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనైనా సమాచార హక్కు చట్టాన్ని రాష్ట్ర కమిషనర్ను తక్షణమే నియమించి చట్టాన్ని ప్రతిష్టంగా అమలయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**-వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి ఆగస్ట్ 2 (చైతన్య గళం):** మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే దోమల నివారణకు పరిష్కార మార్గమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ప్రతి ఫ్రై డే డ్రై లో భాగంగా శుక్రవారం ఉదయం వనపర్తి పట్టణంలోని 5వ వార్డు, 18 వ వార్డుల్లో జరుగుచున్న డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది, అంగన్వాడి, ఆశా వర్కర్లు వార్డుల్లో ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పిస్తుండగా జిల్లా కలెక్టర్ సైతం డ్రై డే ప్రాముఖ్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు.ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, కొబ్బరి చిప్పలు, పాత కుండలు, పాత టైర్లు ఇంటి ప్రాంగణంలో లేదా ఇంటి పై కప్పు పై పడేయడం వల్ల వాటిలో వర్షపు నీరు నిలువ ఉంటుంది. స్వచ్ఛమైన నిలువ నీటిలో డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక దోమలు లార్వా పెట్టీ వ్యాప్తి చెందుతాయని, ఒకసారి డెంగ్యూ లాంటి వ్యాధి వస్తే లక్షల్లో ఖర్చు చేసుకోవడమే కాకుండా కొన్నిసార్లు ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుందని కలెక్టర్ వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. తమ ఇంటి పరిసరాల్లో పాత వస్తువులు లేకుండా చూసుకోవడం, నిలువ నీరు ఎక్కడ ఉండకుండా డ్రై డే రోజు పని చేసుకోవాలని పిలుపునిచ్చారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుండి తమకు తాము కాపాడుకోవచ్చని అందుకే ప్రభుత్వం ప్రతి శుక్రవారం డ్రై డే ను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆదేశాలు జారి చేసిందన్నారు. వచ్చే సోమవారం నుండి స్వచ్ఛదనం, పచ్చదనం అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, జడ్పి సి. ఈ ఓ యాదయ్య, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఎస్.సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాము

**-బిఆర్ఎస్ అధికార ప్రతినిధి..వాకిటి.శ్రీధర్**



**వనపర్తి ఆగస్టు 2 (చైతన్య గళం):** ఎస్.సి వర్గీకరణను బీ.ఆర్.ఎస్ పార్టీ స్వాగతిస్తుందని వాకిటి శ్రీధర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఎస్సి వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం చేశారని ఈ తీర్మానమే వర్గీకరణకు ఉపయోగపడిందని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటాన్ని శ్రీధర్ అభినందించారు. ఎన్ని పోరాటాలు మాదిగ సోదరులు చేసి తమ హక్కులను సాధించుకున్నారని ఈ పోరాటం ఎందరికో స్ఫూర్తి దాయకం అవుతుందని అన్నారు.ఎస్.సి వర్గీకరణకు సహకరించిన రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కంచరవి, పట్టణ భారాసా ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, రహీం విద్యార్థి నాయకులు హేమంత్ ముదిరాజ్, వడ్డే శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వజ్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ఘనంగా మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం



**వెల్దండ ఆగస్టు 2 (చైతన్య గళం):** వెల్దండ మండల కేంద్రంలో నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో గ్రామ మాదిగ సంఘం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం దళిత బాంధవులు తన జీవితాన్ని సర్వస్వాన్ని త్యాగం చేసి ఈరోజు వర్గీకరణను తారా స్థాయికి తీసుకుపోయిన మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ కి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది నిన్న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఏడు సభ్యుల అభిప్రాయం ఏకాభిప్రాయంగా అణగారిన వర్గాల షెడ్యూల్ క్యాస్ట్ లో ఉప కులాలను వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం ఆనంద సూచనీయం మాదిగ జాతికి ఇది గొప్ప అరుదైన వరం 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం జాతి గురించి జాతి బాగోగుల గురించి తన సర్వస్థాన్ని కోల్పోయి జీవితాన్ని మాదిగ జాతి వర్గీకరణ గురించి పణంగా పెట్టిన మందకృష్ణ మాదిగ కి మండల నాయకులు జేజేలు పలికి వారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి వారి పట్ల వారి ప్రేమను చాటుకున్నారు వారి ఉద్యమ స్ఫూర్తిని తీసుకొని రాబోవు కాలంలో కూడా మరిన్ని జాతికి మంచి చేకూరే ఉద్యమాలు చేస్తామని తెలియజేశారు జాతి వర్గీకరణ గురించి కేసులు పెట్టిన వాళ్ళ జీవితాలు త్యాగం చేసి తినడానికి తిండి లేకున్నా గాని ఎన్నో ఉద్యమాలతో ఈరోజు విజయం సాధించామని అని అన్నారు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గుద్దేటి జనార్ధన్ పుల్లయ్య పుష్పగిరి పోలే అశోక్ కిష్టాలు ముదిగొండ రమేష్ ఎర్ర శీను కిరణ్ మంగళగిరి సత్యం దాసరి శివప్రసాద్ శ్రీను ఆనంద్ ప్రశాంత్ అశోక్ దాసరి అఖిల్ బైరాపూర్ జంగయ్య గుండాల మాజీ సర్పంచ్ మైసయ్య ఈదులపల్లి రాజు జోగు రవికుమార్ వెంకటయ్య టైలర్ నరసింహ నవీన్ జగన్ రమేష్ వినోద్ చింటూ సత్యం భగవంతు తదితరులు పాల్గొన్నారు

# చెప్పులు కుట్టే చేతులు చరిత్రను సృష్టించేలా చేశారు

- తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు "బక్కని నర్సింహులు"
- వర్గీకరణ అమలు చేసింది మొట్టమొదట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే
- ఎబీసీడి వర్గీకరణ సాధించే కృషిలో "బాబు" మార్క్ ఎనలేనిది
- ఎస్సి వర్గీకరణకు సహకరించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన బక్కని నర్సింహులు



**హైదరాబాద్ ఆగస్ట్ 2 (చైతన్య గళం):** చెప్పులు కుట్టే చేతులు చరిత్ర సృష్టించాలి.. మళ్లీ వర్గీకరణ జరిగితేనే అది సాధ్యమవుతుంది అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాదిగలను ఉద్దేశించి 2012లో "వస్తున్న మీకోసం" కార్యక్రమం సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో అన్న మాటలు నేడు నిజమయ్యాయని ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ సాధించే క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిని జాతి మరువరానిదని, అందుకే మనస్ఫూర్తిగా ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అంటూ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం ఆయన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ..ఎస్సీలకు ఏబిసిడి వర్గీకరణ చేసే బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందని ఆనాడే చెప్పి మందకృష్ణ మాదిగ దండోరాకు ఆనాడే మద్దతు పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలని తెలిపారు. చెప్పులు కుట్టే చేతులు చరిత్ర సృష్టించాలి అన్న ప్రసంగం నేటికీ పాలమూరు ప్రజలకు గుర్తుండిపోయిందని అన్నారు. 2012 సంవత్సరం అక్టోబర్ 26వ తేదీన వస్తున్న మీకోసం తెలుగుదేశం పాదయాత్ర కార్యక్రమంలో అమరవాయి మీదుగా బూడిదపాడు వద్ద రోడ్డుపై చెప్పులు కుట్టుకునే హనుమంతు అనే వ్యక్తి వద్ద ఆగి చంద్రబాబు నాయుడు స్వయంగా చెప్పులు కుట్టారని అప్పుడే ఈ ప్రసంగం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ గురించి కీలకంగా మాట్లాడిన చంద్రబాబు ప్రసంగానికి నేటికీ 11 సంవత్సరాల 9 నెలల ఆరు రోజులు అయ్యిందని బక్కని నర్సింహులు గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదట ఏబిసిడి వర్గీకరణ అమలు చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు. అప్పుడున్న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు జోక్యంతో ఏబిసిడి వర్గీకరణ అమలు సగంలోనే ఆగిపోయిందని పేర్కొన్నారు. అయితే మందకృష్ణ మాదిగ దండోరా కార్యక్రమానికి ఆనాడే మద్దతు పలికిన చంద్రబాబు నాయుడు వర్గీకరణ సాధించే క్రమంలో తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారని మళ్లీ ఇప్పుడు కేంద్రంలో కీలక భూమిక పోషిస్తున్న చంద్రబాబు మాదిగలకు ఏబిసిడి వర్గీకరణ అవకాశం అందించే విధంగా మరోసారి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని ఆయన కొనియాడారు.

# 30 ఏళ్ల ఉద్యమాని నిలబెట్టిన మందకృష్ణ మాదిగ గారి సంకల్పానికి ఇదే నిదర్శనం

-సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని నిలబెట్టింది సామాజిక న్యాయం వైపు నిలబడింది
-ఇది రాజ్యాంగ స్పూర్తికి నిలువెత్తు నిదర్శనం
-ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల పోరాట ఫలితానికి సుప్రీంకోర్టు చరిత్రత్మక తీర్పునిచ్చింది.



**ఎటపాక : ఆగస్టు 2 (చైతన్య గళం):** మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో అగ్నిపర్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టబద్ధమే అని భారత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షం వ్యక్తం చేస్తూ నెల్లిపాక కూడలిలో ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.అనంతరం మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి, పాలాభిషేకం చేసి విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో సీనియర్ యం. యం.ఆర్ పి యస్ నాయకులు గద్దల. రమణయ్య పాల్గొని మాట్లాడుతూ ఈరోజు భారత రాజ్యాంగం నిజంగా అమలులోకి వచ్చిన రోజుగా మేము భావిస్తా ఉన్నామని.30 ఏళ్ల ఈ సుదీర్ఘమైనటువంటి పోరాటంలో ఎంతోమంది అమరుల త్యాగ ఫలితంగానే ఈనాడు సామాజిక యుద్ధ రంగంలో ధర్మమే గెలిచి వచ్చినట్టుగాఈతీర్పు కనబడుతున్నదని.అదేవిధంగా మూడు దశాబ్దాల సామాజిక న్యాయ పోరాటంలో జాతి కోసం, జాతి భవిష్యత్తు కోసం, జాతి ఆత్మగౌరవం కోసం, జాతి అస్తిత్వం కోసం సామాజిక ఉద్యమాల సూర్యుడు, నవ యుగ అంబేద్కర్ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పని చేసిన మామూలు కార్యకర్త నుంచి మొదలుకొని నేడు రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకుల వరకు ఎదిగిన ప్రతి ప్రతి ఒక్కరికి ముఖ్యంగా జాతి కోసం జాతి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కుటుంబాలను సైతం వదులుకొని జీవితాలనే త్యాగం చేసినటువంటి అమరుల త్యాగ ఫలితమే ఈనాడు వచ్చిన ఈ తీర్పుఅని,మూడు దశాబ్దాలలో ఎన్నో నిర్బంధాలు, ఎన్నో అక్రమ అరెస్టులు, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, ఎన్నో ఎదురైన పట్టిన పట్టు విడవకుండా ఎన్ని రోజులకైనా న్యాయమే గెలుస్తుందని, అధర్మ ఓడిపోతుంది ధర్మమే గెలుస్తుంది అన్నమాట మంద కృష్ణ మాదిగ సాధించి చేయించి చూయించారని. ఇది ఆయనకే సాధ్యం ఆయన సామాజిక ఉద్యమానికే సాధ్యం అని యావత్ మాదిగ జాతి గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ గారికి రుణపడి ఉంటుందని, సుప్రీంకోర్టు ద్వారా మాదిగల ఆకాంక్ష లక్ష్యాన్ని నెరవేసేందుకు సహకరించిన భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీకి బిజెపికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మందా. శ్రీనివాసరావు, రాయల. ఈశ్వర్, మందా. సుబ్బు, గద్దల. ప్రవీణ్, గొడ్ల. తిరుపతి, మందా. వీరబాబు, పింగిలి. వెంకన్న, తదితరులు పాల్గొన్నారు..

# ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మక తీర్పు

-బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ మండల అధ్యక్షుడు బంగారి వెంకటేష్



**రాజాపూర్ ఆగస్టు 2 (చైతన్య గళం):** ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మక తీర్పని బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ మండల అధ్యక్షుడు బంగారి వెంకటేష్ పేర్కొన్నారు. మాదిగ -మాదిగ ఉప కులాల 60 సంవత్సరాల కల నెరవేరిందని, ఏబీసీడీ వర్గీకరణతో మాదిగలకే కాకుండా ఉప కులాలందరికి న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. గత 31 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి తెర పడినట్లు అయిందని పేర్కొన్నారు. గతంలోని బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో శాసన సభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వనికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. దుష్ట శక్తుల కుట్రలను తలదన్నే రీతిలో భారతదేశ సర్వో న్యాయ స్థానం తమ తీర్పు ద్వారా ఎస్సీ వర్గీకరణ చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పించిందన్నారు. గతంలో తాను కూడా ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో పాల్గొనడం జరిగిందని, ఎన్నో పోరాటాలు చేసామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మక తీర్పులో ప్రధాన భూమిక పోషించిన మందకృష్ణ మాదిగ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారు

-బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఉదిత్యాల శ్రీధర్ గౌడ్



**బాలానగర్ ఆగస్టు 2 (చైతన్య గళం):** తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఉదిత్యాల శ్రీధర్ గౌడ్ ఆక్షేపించారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలిసి కూడా నిరుద్యోగుల ఉద్వేగాల్ని రెచ్చగొట్టేవిధంగా కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు. దీనికి తెలంగాణ యువత త్వరలోనే తప్పకుండా సీఎం రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని శ్రీధర్ గౌడ్ హెచ్చరించారు.

# గ్రామ పంచాయతీ అభివృద్ధికి కార్యదర్శుల సేవలు వెలకట్టలేనివి

-ప్రశంసించిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు
-బదిలీపై వెళ్తున్న కార్యదర్శి కి ఘన సన్మానం.. నూతన కార్యదర్శికి స్వాగతం







**బాలానగర్ ఆగస్టు 2 (చైతన్య గళం):** పంచాయతీలే పట్టుకొమ్మలు అన్న విధంగా.. గ్రామపంచాయతీల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శుల సేవలు వెలకట్టలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు నేరళ్లపల్లి సుధాకర్ గౌడ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఈ మేరకు బాలనగర్ మండల పరిధిలోని నేరెళ్లపల్లి గ్రామంలో వీడుకోలు, స్వాగత సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ కార్యదర్శిగా గతంలో పనిచేసి బదిలీపై వెళు తున్న పంచాయతీ కార్యదర్శి ఎర్రళ్ల శ్రీనివాసులును శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడుకోలు పలికారు. అలాగే బదిలీపై గ్రామానికి నూతన పంచాయతీ కార్యదర్శి గా వచ్చిన నరేందర్ రెడ్డిని మాజీ సర్పంచ్ ఖలీల్, మాజీ కోఆప్షన్ మెంబర్ జమీర్ పాషా, సుధాకర్ గౌడ్, పాఠశాల మాజీ చైర్మన్ బిక్కు యనాయక్, జగత్ ప్రకాష్, మాజీ ఏఎంసి డైరెక్టర్ శ్రీను, యాదగిరి తదితరులు శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీల ప్రణాళిక పద్ధ అభివృద్ధికి కార్యదర్శుల పాత్ర ఎంతగానో ఉంటుందని పేర్కొన్నారు. వారు గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు.

# తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించింది

-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భుజ్యా నాయక్
-ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం



**బాలానగర్ ఆగస్టు 2 (చైతన్య గళం):** ఎస్సీ వర్గీకరణ పై తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందని తద్వారా మంచి తీర్పు లభించిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భుజ్యా నాయక్ హర్షం ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే గత ప్రభుత్వం సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 23న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, దామోదర రాజనర్సింహ అడ్వకేట్ జనరల్‌ను సుప్రీంకోర్టుకు పంపించారన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టులో న్యాయ నిపుణులతో వాదనలు వినిపించారని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఇప్పుడు అమలులో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్‌లో కూడా మాదిగ, మాల ఉప కులాలకు రెజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకోసం అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకోస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడం హర్షనీయమని భుజ్యా నాయక్ తెలిపారు.

# మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల ఉద్యమ ఫలితమే ఎస్సీ వర్గీకరణ





**రాజాపూర్ ఆగస్టు 2(చైతన్య గళం):** మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల ఉద్యమ ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధించినట్లు అయిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు రాజాపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తానందు ఎమ్మార్పీఎస్, వివిధ పార్టీల కుల సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. బాణాసంచాలు కాల్చి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచడం జరిగింది. ఈ సందర్భంగా నరిగె యాదయ్య మాదిగ మాట్లాడుతూ... మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 30 సంవత్సరాలుగా అలు పెరగని పోరాటాలు చేసామమని, అనేక నిర్బంధాలు, అనేక బలిదానాలు, వేలాదిమంది జైలు జీవితాలు నడుమ దేశ సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ప్రధాన న్యాయమూర్తి ఎస్సీ వర్గీకరణ తీర్పును వెల్లడించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సిములు, పోలేపల్లి యాదయ్య, కాటిపాక ఆనందు, కావలి రామకృష్ణ, పల్లె శేఖర్, పెరుమళ్ళ సాయి కుమార్, పెరుమళ్ళ జంగయ్య, ఆదిత్య, పోలేపల్లి నరసింహులు, కుచ్చర్కల్లు కృష్ణయ్య, బుగ్గయ్య, కోసి మల్లేష్, రాగపల్లి శేఖర్, భీమ గళ్ళ నర్సింలు, ఏబీవీపీ బాల్రాజ్, మండల నాయకులు కార్యకర్తల పార్టీలకు అతీతంగా కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ కు తొలి అడుగు టిడిపి దే

– టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి యాదిలాల్



**ఆమనగల్లు ఆగస్ట్ 2 (చైతన్య గళం):** సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అందేకర్ యాదిలాల్ కోరారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఆది నుంచి టీడీపీ పార్టీ మాదిగలకు మద్దతుగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యాదిలాల్ మాట్లాడుతూ 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమీషన్ వేసి దేశంలో తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ పై టీడీపీ ముందడుగు వేసిందన్నారు. సామాజిక న్యాయం సమానత్వం ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ పేదల శ్రేయస్సే టీడీపీ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం గెలువాలన్నదే టీడీపీ సిద్ధాంతమని అత్యంత నిరుపేదలకు ప్రభుత్వ ఫలాలు అందించడానికి వర్గీకరలు దోహద పడుతుందని యాదిలాల్ అభిప్రాయపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటం అభినంద నీయమన్నారు. ఎమ్మార్పీఎస్ పోరాటాన్ని ముందుకు నడిపించి విజయాన్ని చేకూర్చడంలో ఏపీ సీఎం చంద్రబాబు తెచ్చిన చట్టమే కారణమని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు చేసిన చట్టాన్నే సుప్రీం కోర్టు సమర్థించించని యాదిలాల్ పేర్కొన్నారు. విలేఖరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కండె సత్యనారాయణ,పార్లమెంట్ కోశాదికారి అర్థం నర్సింహా, నాయకులు పంచాక్షరీ,కండె భాస్కర్, గాజుల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.